క్లుప్తంగా

ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలి


హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

రాజంపేట: పట్టణ వాసులు, వ్యాపారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని పురపాలక కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పలు వీధుల్లో శనివారం ఆయన డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రక్రియ నిర్వహించారు. హోటళ్లను పరిశీలించి అక్కడ పారిశుధ్య పనితీరుపై సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ హోటల్ యజమానులు తగిన రీతిలో నిబంధనలు పాటించాలన్నారు. చెత్త చెదారం రోడ్ల మీద, కాల్వల్లో పడేయవద్దని సూచించారు. చెత్త సేకరణ వాహనాల్లో ఇవ్వకుండా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం


జెండా ఎగురవేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. పట్టణంలోని మాసాపేట ఐటీఐలో శనివారం ఏఐవైఎఫ్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నడిపించే శక్తి యువతకు ఉందన్నారు. యువత ఏఐవైఎఫ్‌లో భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కోటేశ్వరరావు, అరుణ్, రాజశేఖర్, ఓబులేసు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుండుపల్లె: మండలంలోని మైనార్టీలు రాయితీ రుణాలు పొందేందుకు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు లక్ష రూపాయల నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనార్టీలకు లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రాయితీ రుణం అందిస్తామన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు

రాయచోటిజగదాంబసెంటర్: రాయచోటి పరిధిలోని కొత్తపేటలో వెలసిన ప్రసన్న ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పుష్పాలతో అలంకరించి ఆకుపూజ, సిందూర పూజలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


అలంకరణలో స్వామి

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

పెనగలూరు: పెనగలూరు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ సహజ బ్లెస్సీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు ఏప్రిల్ 21న పరీక్ష జరిగిందని, సంబంధిత ఫలితాలను మోడల్ స్కూల్ నోటీసు బోర్డుపై అతికించామన్నారు. విద్యార్థుల ఫలితాలను చూసుకోవచ్చని తెలిపారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా


ట్యాంకర్ వద్ద బారులు తీరిన జనం

సిద్దవటం: మండలంలోని నేకనాపురం వాసులకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో మండలంలోని భాకరాపేట, బొగ్గిడివారిపల్లె, నేకనాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని, దీంతో ఆ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తిందన్నారు.

మంత్రి పూజలు


పూజలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం: మండల కేంద్రంలో జరుగుతున్న మహాభారతం యజ్ఞంలో రాష్ట్ర, రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని మహిళలు, వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సూచించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం స్థానిక నేత మనవడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు.

సౌమ్యనాథ స్వామి ఆలయంలో అన్నీ సమస్యలే


ఆలయంలో తొలగించని చెత్త


అపరిశుభ్రంగా ఉన్న ఆలయ కోనేరును చూపుతున్న సౌమిత్రి చంద్రనాథ్

ఆలయ మాజీ అధ్యక్షుడు సౌమిత్రి చంద్రనాథ్

నందలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సౌమ్యనాథ స్వామి ఆలయంలో వివిధ సమస్యలతో భక్తులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని ఆలయ మాజీ అధ్యక్షుడు అరిగె సౌమిత్రి చంద్రనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్నా.. ఆలయ నిర్వహణ లోపభూయిష్టంగా ఉందన్నారు. ఉత్తర ప్రహరీ కూలితే ఇంతవరకూ పునర్నిర్మాణం చేయలేదన్నారు. ఆలయంలో అపరిశుభ్రత తాండవిస్తోందని, పాములు సంచరిస్తున్నాయన్నారు. ప్రతి శనివారం ఉభయ కడప జిల్లాలు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు. ఆలయంలో 108 ప్రదక్షణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే విశ్వాసం భక్తుల్లో ఉందని తెలిపారు. ప్రాంగణంలో పవిత్రమైన స్వామి కోనేరులో నీరు పాచిపట్టి అధ్వానంగా ఉందన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రసాదం అందజేసే విధానం గతంలో కొనసాగిందని, నేడు దానికి స్వస్తి చెప్పారన్నారు. టీటీడీ ఈవో, జేఈఓలు సౌమ్యనాథస్వామి ఆలయాన్ని సందర్శిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని తెలిపారు. అన్న ప్రసాదాల విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సూపర్ సిక్స్ హామీలు అటకెక్కించారు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి


వృద్ధురాలితో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్: సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించారని, కొత్త పింఛన్లను విస్మరించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పింఛనుదారులను శనివారం ఆయన కలిసి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ మంజూరుపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. వితంతు పింఛన్లకు మెలిక పెడుతున్నారని ఆరోపించారు. సర్వే పేరుతో దివ్యాంగులను ముప్పు తిప్పలు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వితంతు పింఛన్ మంజూరులో కొత్త విధానం వారికి అశనిపాతంలా మారిందన్నారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన వారి కుటుంబాలకు కొత్త దుఃఖాన్ని తెచ్చిపెడుతోందన్నారు. 60 ఏళ్ల లోపు వయస్సున్న వారికి పింఛన్ రాదని చెప్పడం సరికాదన్నారు. జగన్ ప్రభుత్వం అర్హతే ఆధారంగా అందరికీ పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీ ఊసెత్తడం లేదని విమర్శించారు. అర్హత కలిగిన వృద్ధాప్య, వికలాంగులు, చేనేత, కల్లుగీత, మృత్స్యకార, ఒంటరి, చర్మకార్మికులు, డప్పు కళాకారులకు కొత్త పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

ఆగిన రేషన్ కార్డులు: ఎన్నికల కోడ్ తరువాత రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఆగిపోయాయన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ విడుదల కావడంతో అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డులు నిలిచిపోయాయని చెప్పారు. కొత్త రేషన్ కార్డులు కావాలని, పేర్లు మార్పులు చేసుకోవాలని, అడ్రస్సులు మార్పు చేసుకోవాలని, ఆరోగ్యశ్రీ కార్డులు (ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ) వంటి కార్డులలో పేర్లు కావాలని కోరుకొంటున్నట్లు చెప్పారు. ఆగిన రేషన్ కార్డుల సవరణలను ప్రారంభించాలని కోరారు.

మోదీ, చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారు

డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్


మాట్లాడుతున్న గాజుల భాస్కర్

రాయచోటి అర్బన్: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ఏళ్లతరబడి ప్రజలను మభ్యపెడుతూ కాలంవెలిబుచ్చుతున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజులభాస్కర్ అన్నారు. విలేకరులతో శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ విభజన చట్టం ప్రకారం నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. ఐదేళ్లకోమారు శంకుస్థాపన చేస్తూ మిన్నకుండి పోతున్నారంటూ మండిపడ్డారు. పదేళ్ల కిందట మాటలు చెప్పి మోసం చేసిన నేతలు, ఇపుడు మళ్లీ అవే అవే అబద్ధాలతో వంచిస్తున్నారన్నారు. లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రానికి రూ.60 లక్షల కోట్లు అప్పు ఎలా తెస్తారంటూ ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో మన్సూర్ అలీఖాన్, ఖదీర్, అమీర్‌బాషా, దర్బార్, చెన్నక్రిష్ణ, బాబాసర్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ పరిధిలోని వడ్డివారిపల్లెలో గత మూడు రోజులుగా తాగునీరు రావడం లేదని మహిళలు ఆరోపించారు. ఖాళీ బిందెలు చేతబట్టి తమకు నీటి సరఫరా చేయాలంటూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి నీటి సరఫరా నిలిచిపోయిందని, నీరు రాకపోవడంతో ఒక చేతిపంపును వాడాల్సి వస్తోందన్నారు. అందులో 5, 6 బిందెలకు మించి నీరు రాలేదన్నారు. నీటి సరఫరా చేయాలని వారు కోరారు.

చోరీలకు అవకాశం ఇవ్వద్దంటూ పోలీసుల ప్రచారం


చోరీలపై అప్రమత్తం చేస్తున్న పోలీసులు

రాజంపేట: వేసవి సెలవుల కాలం నడుస్తోంది... వేసవి విహారానికి వెళ్లేవారంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.. చోరీలకు అవకాశం ఇవ్వొద్దు అంటూ మన్నూరు పోలీసులు శనివారం తమ పోలీస్ స్టేషన్ పరిధిలో మైకుల ద్వారా వినూత్న ప్రచారం చేశారు. సీఐ కుళాయప్ప మాట్లాడుతూ విహార యాత్రకు వెళ్లేవారు.. ఇళ్లకు తాళాలు వేసి ఉంటే దుండగులు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళ చోరీలకు పాల్పడుతారన్నారు. టూర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరుచకోవడంతోపాటు ఇతరత్రా సేఫ్టీ ప్లేస్‌లో ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. కొత్త వ్యక్తుల కదిలికలపై సమాచారం ఇవ్వాలన్నారు.

అరటి, బొప్పాయి పంటల రైతులకు నష్టం


దెబ్బతిన్న అరటి పంట

ఒంటిమిట్ట: ఈదురు గాలులు, భారీ వర్షాలకు మండలంలోని నరవకాటిపల్లి పంచాయతీ జౌకులపల్లి, మండపంపల్లి పంచాయతీ సాగు చేసిన అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. హార్టికల్చర్ సింధూరి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని జౌకులపల్లి, మంటపంపల్లి గ్రామాల్లో ఈ నెల ఒకటో తేదిన 55 ఎకరాలలో అరటి, 9 ఎకరాలలో బొప్పాయి నేలమట్టమైందని తెలిపారు. మంటపంపల్లిలో 25 ఎకరాల్లో అరటితోట దెబ్బతిన్నట్లు వారు తెలిపారు. మొత్తం 30 మంది రైతులు నష్టపోయారని హార్టికల్చర్ అధికారి వెల్లడించారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


ఆలయంలో సీతారాముల కల్యాణం

పెనగలూరు: మండలంలోని నడిమి సిద్దవరం గ్రామంలో శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణ, మేళ తాళాల మధ్య ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తులను అలంకరించి ఊరేగించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దవరం గంగయ్య, గంగమ్మ, సుబ్బరాయుడు, లత పాల్గొన్నారు.

వంద క్వింటాళ్ల జనుము మంజూరు

సిద్దవటం: మండలానికి 100 క్వింటాళ్ల జనుము మంజూరు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట విత్తనాల పంపిణీలో భాగంగా జనుము విత్తనాలు 50 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎకరాకు పది కిలోల విత్తనాల మోతాదు, తద్వారా 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందన్నారు. టన్ను పచ్చిరొట్ట ఎరువులో నాలుగు కిలోల నత్రజని, కిలో భాస్వరం, 5.3 కిలోల పొటాష్, లభిస్తుందని తెలిపారు. పది కిలోల ధర రూ. 545 మాత్రమేనని, కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ కొరకు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు.

వీరభద్రస్వామికి పూజలు


స్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి పీఠాధిపది పగడాల లక్ష్మీపతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో డీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు లక్ష్మీపతి స్వామికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామికి పూజలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్యస్వామి

నందలూరు: నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధివినాయక స్వామి ఆలయంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరుడికి షష్టి సందర్భంగా అర్చకులు సరసా రవికుమార్‌శర్మ శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి ముందుగా పంచామృత అభిషేకం, అర్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని పాలతో అభిషేకించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కేథార్, చిన్నసుబ్బరాయుడు, శ్రీనివాసులు, కొట్టే శ్రీహరి, గంగాదేవి, సులోచన, నాగలక్ష్మీ, దానమ్మ, సాయిచేతన్, అరిగెల రవిబాబు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిషేధిత మందులు అమ్మరాదు


మాట్లాడుతున్న అర్బన్ సీఐ వెంకట చలపతి

రాయచోటి టౌన్: వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యువతకు నిషేధిత మందులు అమ్మరాదని అర్బన్ సీఐ వెంకటాచలపతి సూచించారు. రాయచోటి పట్టణంలోని మందుల షాపుల యజమానులతో జరిగిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు బానిసగా మారి.. నిషేధిత మందులు వాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. అనుమానస్పందంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

11న నరసింహస్వామి కల్యాణం

లక్కిరెడ్డిపల్లి: ఈ నెల 11వ తేదీన కుర్నూతల క్రాస్ రోడ్డులో మర్రిచెట్టు వద్ద వెలసిన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు వెంకట నారాయణశాస్త్రి, ఆలయ నిర్వాహకులు తెలిపారు. లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవ లగ్నపత్రికను అర్చకులు సమక్షంలో శనివారం నిర్వాహకులు రాయించారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొనాలని కోరారు.

రైతులకు పీఎండీఎస్ కిట్ల పంపిణీ


పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

చిన్నమండెం: 365 రోజుల సాగు లక్ష్యంగా రైతులకు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్(పీఎండీఎస్) కిట్లను పంపిణీ చేస్తున్నట్లు పీఈ చలపతినాయుడు, సీఆర్పీ చంద్ర మోహన్ తెలిపారు. మండలంలోని దేవగుడిపల్లెలో పీఎండీఎస్ పథకం కింద 30 రకాల విత్తనం గల 20 కిట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎండీఎస్ ద్వారా వర్షాకాలం ప్రారంభానికి ముందే సాగు ప్రారంభించడంతో మట్టిలో తేమ నిలిచి, సూక్ష్మజీవుల చురుకుదలతోపాటు పోషకాల శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ స్వాతి, రాజేశ్వరి, నాగలక్ష్మీ, కవిత, హెచ్ఎన్‌శ్రీఫ్ పావని పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో భూసారం పెంచవచ్చు

నవ ధాన్యాల సాగుతోనే భూసారాన్ని పెంచవచ్చని మోడల్ మేకర్ చలపతినాయుడు పేర్కొన్నారు. మండలంలోని పడమటికోన యూనిట్ కలిబండలో పీఎండీఎస్ పద్ధతిలో 30 రకాల విత్తనాలను జీవామృతంతో శుద్ధి చేసి సాగు చేశారు. ఈ సందర్భంగా చలపతినాయుడు మాట్లాడుతూ నవ ధాన్యాల సాగుతో 365 రోజులపాటు భూమి పచ్చదనంతో ఉండడమేగాక కలుపు రాకుండా ఉంటుందని తెలిపారు. భూమి కోతకు గురికాకుండా వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే గుణం కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ రెడ్డికళావతి, ఐసీఆర్‌పీలు ధర్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బోర్డో మిశ్రమం తయారీపై అవగాహన


బోర్డో మిశ్రమాన్ని తయారు చేస్తున్న విద్యార్థినులు

సిద్దవటం: బోర్డో మిశ్రమం తయారీ, వాడకంపై వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జ్యోతి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు మాట్లాడుతూ బోర్డో మిశ్రమం తయారీకి ముందుగా కిలో తామ్ర సల్ఫేట్, ఐదు లీటర్ల నీటిలో కరిగించుకోవాలన్నారు. మరో బకెట్‌లో కిలో సున్నం, ఐదు లీటర్ల నీటిలో కలపాలని తెలిపారు. అనంతరం సున్నం ద్రావణాన్ని తామ్ర సల్ఫేట్ ద్రావణంలో కలపాలన్నారు. ఈ మిశ్రమాన్ని ఫలధార, కూరగాయల పంటల తోటలలో వ్యాధుల నివారణకు ఉపయోగించ వచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రయోగాలతోనే సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి


పిల్లలతో ప్రయోగం చేయిస్తున్న ఉపాధ్యాయుడు

రాయచోటి అర్బన్: ప్రయోగాలతోనే సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంపొందుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం కూడా కొనసాగింది. ఉపాధ్యాయుడు మధుసూదన్‌రాజు వివిధ రకాల సైన్స్ పరికరాలు, వాటి పనితీరు గురించి వివరించారు. ప్రతి విద్యార్థికి పరిశీలన దృష్టి ఉండాలని అన్నారు. ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ భావనలు అర్థం కావడానికి, ప్రయోగాలు ఎంతో ముఖ్యమన్నారు.

కిశోర బాలికల వికాసంతోనే సంక్షేమం


హసనాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న హుసేనమ్మ, కిశోర బాలికలు, తదితరులు

రామాపురం: కిషోర్ బాలికల వికాసంతోనే బాలికల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ రామాపురం సెక్టర్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె, హసనాపురం గ్రామాల్లో జరిగిన కిశోర్ బాలికల వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12–18 ఏళ్ల లోపు బాలికల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అనంతరం పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మీ, రహజాన్, ఝాన్సీ, హైమావతి పాల్గొన్నారు.

ఆర్జిత సెలవులు మంజూరుచేయాలి


మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్: పదో తరగతి ప్రత్యేక తరగతులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. రాయచోటి డైట్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో సాయంత్రం వరకు తరగతుల నిర్వహణ సరైంది కాదన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ రమణయ్య, తోఫిక్, బాలాజీ, షఫీ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి


ఎంపీపీ విన్నవిస్తున్న మహిళలు

వీరబల్లి: నీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని వంగిమల పంచాయతీలోని పోల్ చెన్నారెడ్డిగారిపల్లి హరిజనవాడ, ఎస్టీ కాలనీ మహిళలు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు. తమకు గత నెల నుంచి నీరు రాక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ట్యాంకర్లతోనైనా సరఫరా చేసి సమస్య పరిష్కరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం ప్రక్కనే ఉన్న మాండవ్య నది నుంచి అధిక శాతంలో ఇసుక తరలించడంతో తమ బోర్లలో నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో నదిలో ఇసుక తరలించడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం ఫ్రీ ఇసుక పేరుతో తరలించడంతో నీరు అడుగంటిపోయిందని, తాగడానికి చుక్కనీరు దొరకడం లేదని వారు ఎంపీపీకి తెలిపారు. స్పందించిన ఎంపీపీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పోలు చెన్నారెడ్డిపల్లికి వెంటనే నీటి సరఫరా చేసి సమస్య తీర్చాలని వారు కోరారు.

వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న సీఏవైడీ ప్రతినిధులు

నందలూరు: మండలంలోని అరవపల్లి క్రీడా మైదానంలో సమ్మర్ క్రికెట్ క్యాంపును అందరూ వినియోగించుకోవాలని సీఏవైడీ (క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్) సీడీఓ ఖాజా మొహిద్దీన్, బీసీసీఐ వీడియో అనలిస్టు రెహ్మాన్ పేర్కొన్నారు. విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ సబ్ సెంటర్‌లో కోచ్‌లు చెప్పిన విధంగా మెలకువలు నేర్చుకొని భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. ప్రాక్టీస్ చేసి మంచి క్రీడాకారులుగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గయాజ్, ఫిరోజ్ ఖాన్‌లోడి, శివకోటి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు

మదనపల్లె : టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు...నోరు అదుపులో పెట్టుకోవాలని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే స్థాయి, అర్హత రెండూ లేవన్న విషయం గుర్తుంచుకొని మసలుకోవాలని తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. శనివారం మదనపల్లె ఎంపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...రెండురోజుల క్రితం తంబళ్లపల్లెలో రెండు బ్యాచ్‌ల మధ్య ఆధిపత్యపోరులో భాగంగా జరిగిన ఘర్షణలో బాధితులను పరామర్శిస్తూ...శ్రీరామ్ చినబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటన గురించి పూర్వాపరాలు తెలుసుకోకుండా మాట్లాడటం తగదన్నారు. సంఘటనతో ఎలాంటి సంబంధం లేని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలను బాధ్యులుగా పేర్కొంటూ గంజాయి బ్యాచ్ అంటూ ఏవేవో మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని నీవు...మాజీ ముఖ్యమంత్రిపై గెలిచిన ఎంపీ మిథున్‌రెడ్డిని, మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే...పదవులు వస్తాయనే ఆశతో...స్థాయి, అర్హత మరిచి విమర్శలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నీకు దమ్ముంటే... ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని కాదు...నీ ఇంటి ముందే వెళుతున్న తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకోవాలని సవాల్ విసిరారు. రెడ్‌బుక్ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనను రాజకీయంగా వాడుకోవాలని చూస్తే ప్రజలు హర్షించరన్నారు. తంబళ్లపల్లె అభివృద్ధిలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కృషి ఎనలేనిదన్నారు. టీడీపీ నాయకులకు చేతనైతే, ఆయన కంటే ఎక్కువగా అభివృద్ధి చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. పదవి రాలేదన్న నైరాశ్యంలో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు.